30న నారాయణపురం కాలేజీలో జాబ్ మేళా

ఉంగుటూరు:జిల్లా నైపుణ్యాభివృద్ధి, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఈనెల 30న మండలంలోని నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత వాల్‌పోస్టర్‌ను శనివారం ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ యు.ఆంజనేయులు, సొసైటీ ఛైర్మన్ పాపారావు(బాబ్జీ), ఎంపిటిసిలు బాలకృష్ణ, రాంబాబు ఆవిష్కరించారు. నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సుమారు 15 కంపెనీలతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, వెయ్యిమందికి పైగా ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎంఎల్ఎ వాసుబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా ప్లేస్‌మెంట్ ప్రతినిధులు కె.ప్రవీణ్, కోఆర్డినేటర్ శ్యామ్‌బాబు, బి.దుర్గాభవాని పాల్గొన్నారు.

చెప్పిందేంటీ.. చేస్తున్నదేంటీ..!

జిపిఎస్ అమలు నిర్ణయంపై ఉద్యోగులు ఆగ్రహం
ఎన్నికల్లో ఒపిఎస్ అమలుకు హామీ ఇచ్చి మోసగిస్తారా
సిపిఎస్ కంటే దారుణమైన జిపిఎస్‌ను
అంగీకరించేదిలేదంటున్న ఉద్యోగ సంఘాల నేతలు
నిరసనలకు ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే వారం, పది రోజుల్లో సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి ఉద్యోగులకు ఒపిఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం తమ జీవితాలతో ఆడుకుంటుందని ఉద్యోగులు, ఉద్యోగసంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఎన్నికల్లో 'మీరు చెప్పిందేంటీ.. ఇప్పుడు చేస్తున్నదేంటీ' అంటూ వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకొచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ తెస్తామని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు తర్వాత జిపిఎస్ అమలుకు ప్రభుత్వం ముందుకు సాగడం అత్యంత దారుణమని ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తెస్తున్న జిపిఎస్ కంటే ప్రస్తుతం అమలులో ఉన్న సిపిఎస్ మెరుగైందని, తమకు ఒపిఎస్ అమలు మాత్రమే అంగీకారమని తెగేసి చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వేలాది సంఖ్యలో సిపిఎస్ ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ఎన్నోఏళ్లుగా సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనూ ర్యాలీలు, నిరసనలు, కలెక్టరేట్ ముట్టడి వంటి అనేక ఆందోళనలు చేసిన పరిస్థితి ఉంది. ఎన్నికల ముందు ఉద్యోగులను కోరిన ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్‌ను రద్దు చేస్తామని వైసిపి అధ్యక్షుని హోదాలో జగన్ హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకొచ్చాక ఆ మాటే మరిచిపోయారు. దీంతో ఉద్యోగులు మళ్లీ ఆందోళనల బాట పట్టాల్సి వచ్చింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగుల ఆందోళనలు తీవ్రతరం కావడంతో సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తెస్తామంటూ ప్రభుత్వం కొత్త పల్లవి అందుకుంది. జిపిఎస్‌ను ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గకుండా జిపిఎస్ అమలుకు రాష్ట్ర మంత్రి మండలిలో సైతం తీర్మానం చేసింది. దీంతో ఉద్యోగులు మరోసారి ఆందోళనబాట పట్టారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో తహశీల్దార్, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఆందోళనకు ఇప్పటికే పిలుపునిచ్చారు. తమకు జిపిఎస్ వద్దని, ఒపిఎస్ కావాలని నినదిస్తున్న పరిస్థితి ఉంది.

ఉద్యోగులంతా జిపిఎస్‌కు వ్యతిరేకమే

సిహెచ్.శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల జెఎసి ఛైర్మన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

ప్రభుత్వం చెబుతున్న జిపిఎస్‌కు ఉద్యోగులంతా వ్యతిరేకమే. సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ తీసుకురావాలని ఉద్యోగులు కోరుతున్నారు. కంట్రిబ్యూషన్ లేని మెరుగైన పెన్షన్ భద్రత ఉండాలి. అప్పుడే ఉద్యోగులకు మేలు జరుగుతుంది.

పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్టే

జి.కృష్ణ, ఎపిటిఎఫ్ 1938, జిల్లా ప్రధాన కార్యదర్శి

సిపిఎస్‌ను రద్దు చేసి జిపిఎస్ అమలు చేస్తే ఉద్యోగులంతా పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లే. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు మాట మార్చడం దారుణం. జిపిఎస్ కావాలని ఉద్యోగులు ఎవరైనా అడిగారా ప్రభుత్వం చెప్పాలి. ఒపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదు. చాలా రాష్ట్రాల్లో ఒపిఎస్ ఇచ్చారు. ఉద్యోగులను మోసం చేయడం దారుణం.

సిపిఎస్ కంటే జిపిఎస్ దుర్మార్గమైంది

ఆర్.రవికుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

జిపిఎస్‌ను ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ప్రస్తుతం అమలులో ఉన్న సిపిఎస్ కంటే జిపిఎస్ దుర్మార్గమైన స్కీమ్. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఎటువంటి సొమ్ము రాదు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేదిలేదు. ఇప్పటికే ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాం. 25న చలో కలెక్టరేట్ కార్యక్రమం సైతం నిర్వహించనున్నాం.

ఒపిఎస్ ఇస్తేనే ఉద్యోగులకు సంతోషం

కె.రమేష్, ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్

ఏమాత్రం ఉద్యోగి జిపిఎస్‌ను అంగీకరించే పరిస్థితి లేదు. ఒపిఎస్‌ను అమలు చేస్తేనే ఉద్యోగులు సంతోషంగా ఉంటారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఒపిఎస్‌ను అమలు చేయాలి. ఉద్యోగ సంఘాల నాయకులుగా తామంతా ఒపిఎస్‌నే కోరుకుంటున్నాం.

కంట్రిబ్యూషన్ అనేది ఉండకూడదు

సిబివిఎన్ఎల్ నారాయణ, ఫ్యాప్టో ఛైర్మన్

ఉద్యోగులు కోరుతున్నది ఒక్కటే జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ కావాలి. ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమాత్రం సహేతుకం కాదు. జిపిఎస్‌లో ప్రతినెలా పది శాతం కటింగ్ అవుతుంది. కంట్రిబ్యూషన్ అనేది తీసేసి ఒపిఎస్ అమలు చేయాలి. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగులెవ్వరూ సమ్మతించడం లేదు.

జిపిఎస్‌లో ఉద్యోగ విరమణ పొందాక సొమ్ము రాదు

బొరగం రెడ్డిదొర, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

సిపిఎస్‌లో పదిశాతం ఉద్యోగుల సొమ్ము, పది శాతం ప్రభుత్వ సొమ్ము కంట్రిబ్యూషన్ ఉంటుంది. జిపిఎస్‌లో ఉద్యోగులకు సంబంధించిన పదిశాతం మాత్రమే ఉంటుంది. సిపిఎస్ కంటే జిపిఎస్ మరింత దారుణమైన పెన్షన్ పథకం. ఉద్యోగ విరమణ పొందాక జిపిఎస్ విధానంలో సొమ్ములేవీ రావు. ప్రభుత్వ నిర్ణయం ఏమాత్రం ఒప్పుకోం. ఉద్యోగ విరమణ పొందాక ఉద్యోగుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుందని చెబుతున్నారు. అప్పటి వరకూ పిల్లల చదువులు పూర్తి కాకుండా ఉంటాయా.. ప్రభుత్వం చెప్పాలి.

పారిశుద్ధ్య కార్మికులను గౌరవించాలి : కలెక్టర్

పెదపాడు:ప్రజారోగ్యంతో ముడిపడిన పారిశుధ్య కార్మికులకు గౌరవం, గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం పెదపాడు గ్రామంలో ఉన్న చెత్తనుండి సంపద తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి స్వచ్ఛ భారత్, సిఎం జగన్ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు సంపూర్ణ పారిశుధ్యానికి ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో లేకపోతే ఆరోగ్యం కుంటుపడుతుందని తద్వారా డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబలి ప్రజలు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. దీనిని అధికమించడానికి పారిశుధ్య కార్మికులు చేస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలు మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లోను కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహించి పారిశుధ్య కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు.

భీమడోలు:కరోనాను అదుపు చేసే క్రమంలో క్లాప్‌మిత్రలు అందించిన సేవలు అభినందనీయమని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గుండుగొలను గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామ పంచాయతీ, సచివాలయ, ఇతర శాఖల సిబ్బంది మరియు ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖుల భాగస్వామ్యంతో పుర వీధులలో నిర్వహించిన స్వచ్ఛహిత- ఇ -సేవ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచి లక్ష్మి, ఉప సరర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

29న మహాధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారత రాజ్యాంగాన్ని కాపాడాలని, దళితులకు న్యాయం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, వివిధ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అన్నే భవనంలో ఎం.ఇస్సాక్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పి.రామకృష్ణ, బికెఎంయు నేత బండి వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు బాలరాజు, అంబేద్కర్ ఆలోచన వేదిక నాయకులు ఎం.సంతోష్‌కుమార్, డిబిఆర్‌సి నాయకులు సింగవరపు జ్యోతి, దళిత సంఘాల నాయకులు రవికుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో మనువాదుల చేతుల్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం యావత్ భారతావని తలదించుకునేల చేసిందని మండిపడ్డారు. ఇంత జరిగినా మతోన్మాద ప్రధానమంత్రి మోదీ నోరెత్తకపోవడం, దాడులకు పాల్పడినవారికి రక్షణ కల్పించడం అత్యంత సిగ్గుచేటన్నారు. దళితులను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారిని మనుషులుగా చూడడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా దళితులకు ద్రోహం చేస్తుందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా దళితుల హక్కులు - సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టామని తెలిపారు. ఈ నెల 29న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆందోళనలో దళితులు, ప్రజాతంత్రవాదులు, కార్మికులు, మహిళలు, యువకులు, విద్యార్థులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. దళితుల సామాజిక హక్కులకు, ఆర్థిక డిమాండ్లు పక్కదారి పట్టించిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను తిరిగి కేటాయించి దళితులకే ఖర్చు చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే 41 సిఆర్‌పిసి ప్రకారం బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు, హత్యలు, స్త్రీలపై అత్యాచారాల కేసులను విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.సత్యనారాయణ, రాజశేఖర్, చంటి, కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఏలూరులో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

జిపిఎస్ రద్దు కోరుతూ నిరసన

ఏలూరు అర్బన్:సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఒపిఎస్‌ను అమలు పరచకుండా జిపిఎస్‌ను అమలు పరచడానికి అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసనకార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు పి.నారాయణ అధ్యక్షత వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ గుడిమెల్లి వెంకటేశ్వరరావు, ఫ్యాప్టో కో ఛైర్మన్ జిలాని, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రవికుమార్, రంగావలి, గుగ్గులోతు కృష్ణ, కాంతారావు, కనకదుర్గ, నరసింహారావు, సిపిఎస్ నాయకులు రెడ్డి రామారావు, పవన్, రామారావు, రంగమోహన్ పాల్గొన్నారు.

చింతలపూడి:జిపిఎస్‌ని వ్యతిరేకిస్తూ ఒపిఎస్‌ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో తాలూకా స్థాయిలో చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. అక్కడినుండి ర్యాలీగా వెళ్లి డిప్యూటి తహశీల్దార్ షకీలాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ఎపిసిపిఎస్ ఇఎ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని తక్షణం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శామ్యూల్, రాంబాబు, దామోదర్, రవికుమార్, కంచర్ల. బుచ్చిబాబు, అజయ్, అనంత్, ఆనంద్, లక్ష్మణ్, సుధాకర్, రాము, వేణు, రాజా, ఎన్‌జిఒ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏలూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జలమయమైన రోడ్డు

ఏలూరులో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతగా ఉన్న వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని పిడుగులతో భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు, వ్యాపారులు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వాళ్లు కనీసం వారి సామగ్రిని సర్దుకునే అవకాశం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో సమస్యలు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా ప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ ఎ.మేరిగ్రేసికుమారి తెలిపారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార భవనంలో శాశ్వత లోక్ అదాలత్ గురించి వివిధ శాఖల ప్రభుత్వాధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరిగ్రేసికుమారి మాట్లాడుతూ జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు వారి సమస్యలు కోర్టులో వేయకుండా ఉన్నవారికి నేరుగా ప్రజాప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. వీరికి న్యాయపరంగా ఉచితంగా సమస్యను పరిష్కరించడమే ముఖ్యోద్దేశమన్నారు. ఈ అదాలత్‌లో కోటి రూపాయల వరకు సమస్యను విస్తరించడం జరుగుతుందని తెలిపారు. ఇరుపార్టీల వారిని సమన్వయంతో సామరస్యంగా తక్కువ రోజుల్లో పరిష్కరించి అవార్డు అందజేస్తామన్నారు. శాశ్వత అవార్డు పొందిన తర్వాత ఈ అవార్డును వేరే కోర్టులో అప్పీలు, ఛాలెంజ్ చేసుకునే అవకాశం లేదని తెలిపారు.

సమన్వయంతోనే లక్ష్యసాధన

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ మల్లాది విష్ణు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనకు ఆయా శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్‌ఛైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నవరత్నాల కార్యక్రమాల అనుసంధానంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై జిల్లా అధికారులతో ఆయన శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల కార్యక్రమంతో రాష్ట్రంలో పేదరికం శాతం 12 నుండి 6 శాతానికి వచ్చిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చేస్తున్న కృషి కారణంగానే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో నీతి ఆయోగ్ సూచించిన ప్రమాణాలను చేరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నవరత్నాల ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్ ఎఎన్.నారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఐటిడిఎ పిఒ ఎం. సూర్యతేజ, నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, ఆర్‌డిఒ ఖజావలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

72 మంది రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 17 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకూ జరుగుతున్న సేవా పక్వాడ కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్, జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్‌సతీష్‌కుమార్ మాట్లాడుతూ సేవ పక్వాడ కార్యక్రమాల్లో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన మెగారక్తదాన శిబిరం, ఇతర సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. 103వసారి రక్తదానం చేసిన బావిశెట్టి చిరంజీవిరావును డిసిహెచ్‌ఎస్ అభినందించారు. బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ సేవా పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ కనీసం ఐదు రక్తదాన శిబిరాలు, ఐదు సేవా కార్యక్రమాలు, ఐదు సామాజిక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందని, అందులో భాగంగా ఐదు రక్తదాన శిబిరాలను ఏలూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం జరిగిన మెగా రక్తదాన శిబిరంలో 72 మంది యువకులు రక్తదానం చేశారని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు, కళాశాల ప్రిన్సిపల్‌కు కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె.ప్రసాదరావు, బావిశెట్టి చిరంజీవిరావు, పిఆర్‌ఒ కెవి.రమణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి 25 నుంచి ధర్నాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వ్యవసాయ నష్టాలతో ఇబ్బందుల్లో ఉన్న ప్రతిరైతుకూ రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జంగారెడ్డిగూడెంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు సంఘం జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.జలపాలు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో సమస్యలపై తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల కరపత్రాలను రైతు సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ నష్టాలతో అన్నదాతలు అప్పుల ఊబిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో కార్పొరేట్ కంపెనీలకు రూ.12 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని చెప్పారు. కష్టపడి పంటలు పండిస్తూ దేశానికి తిండి గింజలు అందిస్తున్న అన్నదాతలకు పైసా కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రతి రైతుకూ రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. గత సంవత్సరం టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.23 వేలు ధర ఉంటే ఆ ధర రూ.12,900కు పడిపోయిందన్నారు. టన్నుకు రూ.18 వేలు ధర ఇవ్వాలని కోరారు. పంటల బీమాను ప్రయివేటు కంపెనీలకు అప్పగించొద్దని కోరారు. పంటల బీమాపై జారీ చేసిన జిఒ 660ను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతగా పంటల బీమా అమలు చేయాలని కోరారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేలో సర్వీస్ రోడ్లు నిర్మించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని కోరారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుండి కొబ్బరి కాయలు సేకరించి వెయ్యి కాయలకు రూ.15 వేలు ధర కల్పించాలని కోరారు. టన్ను చెరకుకు రూ.5 వేలకు మద్దతు ధర పెంచాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాలకు చెందిన రైతు సంఘం నాయకులు బిక్కిన వీరసత్యం, దాసరి జానకిరామిరెడ్డి, సింహాద్రి శ్రీనివాసరావు, గరికపాటి రాంబాబు, వామిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : రవి

ఏలూరు:దేశంలో బిజెపి, మతోన్మాద శక్తుల ప్రమాదం పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఏలూరులో సిపిఎం శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. పార్టీ ఏలూరు కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రవి మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి లౌకిక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రపంచం మొత్తం ఆధునిక టెక్నాలజీతో ముందుకు సాగుతుంటే, దేశంలో బిజెపి, మతోన్మాద శక్తులు మూఢత్వ ప్రచారాన్ని పెంచి పోషిస్తున్నాయన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో పాఠ్యపుస్తకాల్లో మహాత్మా గాంధీ వంటి స్వాతంత్ర సమరయోధుల పాత్రలు తొలగించి, గాంధీని చంపిన గాడ్సే, సావర్కర్ గురించి రాస్తున్నారన్నారు. ఈ తరగతుల్లో 'మతోన్మాద రాజకీయాలు - ప్రతిఘటన ఉద్యమాలు' అంశంపై పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య పాల్గొన్నారు. తొలుత సిపిఎం పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు బి.సోమయ్య ఆవిష్కరించారు.

వినడమేనా.. పరిష్కరించేదేమైనా ఉందా..!

రెండు జిల్లాల్లో ప్రజలు స్థానిక, వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతున్నారు. వాటిలో దీర్ఘకాలిక అంశాలతోపాటు ఇటీవల తలెత్తుతున్న సమస్యలు కూడా ఉంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రారంభించాక ప్రజలు తమ అవసరాల కోసం మండల కార్యాలయాలకు వెళ్లడం తగ్గించారు. అయితే సమస్యలు పేరుకుపోతుండటంతో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమానికి మండల, డివిజన్, జిల్లాస్థాయిలో అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. అర్జీలన్నీ ఫిర్యాదుదారునికి సంతృప్తినిచ్చేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు పదేపదే సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నారు. అయినా అర్జీలు తగ్గకపోవడం పెరుగుతున్న సమస్యలకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ప్రజలకు మరింత సౌలభ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇటీవల ప్రతి బుధ, శుక్రవారాల్లో జిల్లాలోని రెండు మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం' పేరిట ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది ఏలూరు జిల్లాలో మెరుగ్గా సాగుతున్నా పశ్చిమగోదావరి జిల్లాలో వాయిదాల పర్వంతో సాగుతోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీనికి జిల్లా ఉన్నతాధికారులు హాజరై అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. జిల్లా, డివిజన్, మండలం, గ్రామ సచివాలయ స్థాయిలో ప్రతి సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తూ వినతులు స్వీకరిస్తున్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదనేది అంతుబట్టని ప్రశ్నగా మిగిలింది. మరి ఇప్పుడు జిల్లా కలెక్టర్ దగ్గర నుంచి జిల్లా అధికారులంతా ఒక్కో మండలానికి వెళ్లి తీసుకుంటున్న అర్జీల పరిష్కారం ఎలా ఉంటుందో వేచిచూడాలి. కొన్ని సమస్యలకు మాత్రం జిల్లా అధికారులు అక్కడికక్కడే పరిష్కారం చూపడం ప్రజలకు ఊరటనిచ్చే అంశం. మిగిలిన అర్జీల మాటేమిటా అనేదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వీటిలో ప్రభుత్వ విధానాలు, ఆర్థిక అంశాలతో ముడిపడినవే ఎక్కువ ఉంటున్నాయని, అలాగే కొన్ని రాజకీయపరమైన ఒత్తిళ్లతో పరిష్కారానికి నోచుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయ ఒత్తిళ్లను జిల్లా అధికారులు పక్కన పెట్టడంతోపాటు ప్రభుత్వం సైతం ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే అర్జీల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. అప్పుడే ఈ ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపించినట్లని పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఇక రెండు జిల్లాల్లో మహాకవి గురజాడ అప్పారావు జయంతి వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటికీ, నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే 'దేశమును ప్రేమించుమన్నా' గేయాన్ని విద్యార్థులచే ఆలాపన చేయించడం అభినందించదగిన విషయం. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో పాలకులు ఎన్నికల ఎత్తుగడలతో స్వదేశీ నినాదం మాటున అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలపై చర్చకు ఈ గేయాలపన అవకాశం ఇచ్చిందనే చెప్పొచ్చు. మహిళా ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు చేపట్టిన విధంగానే మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తీసుకొచ్చారనే భావన జిల్లాలోని మహిళా సంఘాల నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇది చట్టమై అమలైతేనే ఎంతోకొంత ఉపయోగముంటుందని, పేరుకే చట్టం తీసుకొచ్చి చేతులు దులుపుకోవడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పుడే నిజమైన దేశభక్తి, మహిళాభక్తి ఉన్నట్లని వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌తో ప్రతిపక్ష, అధికార పార్టీలు పరస్పర ఆరోపణ, ప్రత్యారోపణలకు దిగుతున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అధికార పక్షం, సమస్యలపై నిలదీయాల్సిన ప్రతిపక్షం రెండూ తమ స్వప్రయోజనాల కోసం పాకులాడుతుండటంతో ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటే అతిశయోక్తి కాదు. చంద్రబాబు అరెస్టుపై దీక్షలు, ప్రదర్శనల్లో టిడిపి నిమగ్నమై ఉంది. అధికారపక్షం సందట్లో సడేమియాలా తన ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తోంది. విద్యుత్ ఛార్జీల భారం మోత కొనసాగుతూనే ఉంది. దీనిపై వామపక్షాలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టి తాజాగా రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి 27న ధర్నాలకు పిలుపునిచ్చాయి. రాజ్యాంగ పరిరక్షణ, దళితుల హక్కులకు భద్రత, మిగులు భూముల పంపిణీ, ఉపాధి హామీ సక్రమ అమలు తదితర డిమాండ్లతో కెవిపిఎస్, వ్యకాస దళిత రక్షణ చైతన్య యాత్ర ప్రారంభించాయి. ఈ యాత్రలోనూ పాలకులు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల పేరుకుపోయిన సమస్యలే తెరపైకొస్తున్నాయి.

ఇక విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పాలకొల్లులో విద్యాసంస్థలను తనిఖీ చేశారు. లోపాలు గుర్తించి సరి చేసుకోవాలని హెచ్చరించారు. అందరికీ ఆదర్శంగా ఉండాలని ఉపాధ్యాయులకు క్లాస్ తీసుకున్నారు. మరి ఆ ఉపాధ్యాయులకు ఆదర్శంగా తాము కూడా ఉండాలని ఈ ప్రభుత్వం, ఉన్నతాధికారులకు అన్పించడం లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎక్కువ ఉన్న సిబ్బందిని వెంటనే వేరే పాఠశాలలకు మార్చాలని ఆదేశించారు. సర్దుబాటు చేసినా సరిపడా సిబ్బంది లేకుండా నెట్టుకొస్తున్న పాఠశాలల స్థితిగతులు ఈ అధికారికి పట్టవా అనే విమర్శలు విన్పిస్తున్నాయి. వసతులు కల్పించాం, రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పదేపదే గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని అడ్డం పెట్టుకుని పాఠశాలల విలీనంతో ప్రాథమిక పాఠశాలలు బోసిపోతుండగా హైస్కూళ్లు కిటకిటలాడుతున్నాయి. నాడు-నేడు పేరిట అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలలు నేడు విద్యార్థులు రాక వెలవెలబోతున్న సంగతి తెలియదా. అనాలోచిత నిర్ణయాలు మాని క్షేత్రస్థాయిలో విద్యాబోధనకు ఆటంకంగా ఉన్న అంశాలపై దృష్టి సారిస్తే విద్యావ్యవస్థ సక్రమంగా ముందుకు సాగుతుంది. యాప్‌లు, విద్యాశాఖ, సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల బకాయిలపైనా దృష్టిసారిస్తున్న దాఖలాల్లేవు. ఇవేమీ పట్టకుండా క్షేత్రస్థాయి పర్యటనల పేరిట సిబ్బందిపై ఒత్తిడి తెచ్చేలా బెదిరింపులకు దిగడం విద్యావ్యవస్థ నిర్వీర్యానికే తప్ప మెరుగుదలకు దోహదపడదని సదరు అధికారికి, ప్రభుత్వానికి తెలియంది కాదు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారంపై నిపుణుల సూచనల మేరకు చర్యలు చేపట్టాలే తప్ప ఉపాధ్యాయులపై వేధింపుల ఆపాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఇటు విద్యావేత్తలు, అటు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం హెచ్చరిస్తున్నారు.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

'గురుకుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

అన్ని రంగాలలో గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా తగిన శిక్షణ, ప్రణాళికలతో ముందడుగు వేస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ నోముల సంజీవరావు తెలిపారు. పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఆణిముత్యాలులో రూ.కోటి గురుకుల విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. మెరుగైన ఫలితాల కోసం సాధన చేస్తున్నాయన్నారని తెలియజేశారు.

30లోపు ఫీజు చెల్లించాలి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఉంగుటూరు

మార్చి 2024లో నిర్వహించబడే ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గత సెప్టెంబరులోగా సైతం ఫెయిలైన వారు ప్రైవేటుగా హాజరు కావటానికి పరీక్ష ఫీజును ఈనెల 30 లోపు చెల్లించాలని నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ బివి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఫీజుతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్, సప్లిమెంటరీ పరీక్ష హాల్ టికెట్ లేదా మార్కుల మెమో తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9441687844ను సంప్రదించాలని కోరారు.

పారిజాతగిరికి 108 రజత పుష్పాలు వితరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వర స్వామి ఆలయానికి దాతలు 108 రజత పుష్పాలను అందించారని ఆలయ కార్య నిర్వాహణాధికారి మానికిరాల రాంబాబు తెలిపారు. శనివారం మొక్కలు చెల్లించడానికి వచ్చిన జంగారెడ్డిగూడెం నివాసులు శ్రీనివాస్, ధనలక్ష్మి కుటుంబ సభ్యులు 108 రజత పుష్పాలను అందించారన్నారు. అలాగే అన్నప్రసాద వితరణ దాతలు నూలకాని శ్రీనివాస్ జ్యోతి, వెంకట్రావు, పార్వతీరాజుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, రెడ్డి రంగప్రసాద్, వాసవిశాయి నరేష్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయని నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త పి.వేణు, మండల సమన్వయకర్త ఎల్.జయరాజులు తెలిపారు. శనివారం ఎంఇఓ బి.రాముడు, శ్రీరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెబిఎస్ లోవ కుమారిల ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.వేణు, ఎల్ జయరాజులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలైన చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి 200 మంది క్రీడాకారులు, విద్యార్థులు ఈ క్రీడలలో పాల్గొంటారని తెలిపారు. అండర్-14 బాలికలు, అండర్-14 బాలురు, అండర్-17 బాలికలు, అండర్-17 బాలురు పాల్గొన్నగా, నియోజకవర్గంలోని పాఠశాలల పిడిలు, పిఇటిలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎ.సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపే

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

ప్రజాశక్తి - చింతలపూడి

రాజకీయ కక్ష సాధింపుతోనే చంద్రబాబు నాయుడుని అక్రమ కేసులు పెట్టి, ఇబ్బందులు పెడుతున్నారని మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ అన్నారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలోనే సైతం బాబు కోసం కార్యక్రమంలో భాగంగా టిడిపి కార్యాలయంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు బొమ్మాజి అనిల్, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, జనసేన మండల ప్రెసిడెంట్ చీదరాల మధుబాబు, యాల్లా లీలా ప్రశాంతి, బోడా అవినాష్, మాటూరి వెంకట్రామయ్య, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు: చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా శనివారం మండపం సెంటర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో గద్దే రఘుబాబు, లక్కపాము కాంతారావు, కందుల పిచ్చియ్య, గారపాటి నరిసింహారావు, మెదరమెట్ల సురేంద్ర, పులిబళ్లలక్ష్మి సత్యనారాయణ, మండవ బుజ్జియ్య, గద్దల మోహానరావు, రాపర్ల ప్రతాప్, బాలకృష్ణ, చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా మండలంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 14వ రోజుకు చేరాయి. మండలంలోని పెదపాలపర్రులో టిడిపి మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి ఆధ్వర్యంలో ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలో కొడాలి వినోద్, గ్రామ సర్పంచి గంటా రాకేష్, చల్లగుళ్ల ఆదిత్య చౌదరి, పాల్గొన్నారు.

గూటాలలో సంగీత కచేరి

పోలవరం: ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు, హరికథ భాగవతులైన నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ వయోలిస్ట్ టికె.రామానుజాచార్యులు గూటాలలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు సంగీత వయోలిన్ కచేరి నిర్వహించారు. తన గురువైన నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల వద్ద వయోలిన్ అభ్యసించారు. ఇలా గురువుని స్మరించుకోవడం తన భాగ్యమని ఆయన తెలిపారు.

ఇన్నోవేటివ్ అవార్డుకు శ్రీదేవి ఎంపిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

శ్రీదేవిను అభినందిస్తున్న ఎడి

జిల్లా ఉద్యానశాఖ ద్వారా ఏర్పాటైన ప్రకృతి ఉద్యాన ఉత్పత్తిదారుల సంఘం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ తరపున నెక్సెజన్ వారు నిర్వహించిన ఇన్నోవేటివ్ ఫీమేల్ ఫార్మర్ జాతీయ అవార్డుల విభాగంలో ఆగిరిపల్లికి చెందిన మాదల శ్రీదేవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖాధికారి డా. ఎస్.రామ్మోహన్, ఆగిరిపల్లి ఉద్యానశాఖాధికారిణి కె.జ్యోతి ప్రియాంకలు ఆమెను అభినందిచారు. ఈ అవార్డును శ్రీదేవి ఈనెల 27వ తేదీన అందుకోనున్నారు.

నేరాలు - ఘోరాలు

అనారోగ్యంతో బాలుడు మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అనారోగ్యంతో బాలుడు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని తాటియాకులగూడెంలో చోటు చేసుకుంది. మామిళ్ల జస్వంత్(8) అనే బాలుడు గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ అశ్వారావుపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెంలోని జాబిల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తెల్లవారు జామున మృతి చెందాడు. అల్లారు ముద్దుగా తిరిగే బాలుడు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

నాటుసారా తయారీ స్థావరంపై దాడి

10 లీటర్లు స్వాధీనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మధ్యాహ్నపువారిగూడెంలో నాటుసారా తయారీ స్థావరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. శనివారం జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ఎన్.సూర్య చంద్రరావు, డిఎస్‌పి ఎం.రమేష్ రెడ్డి ఆదేశాలపై స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్ ప్రసాద్‌కుమార్, సిబ్బందితో కలిసి గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సారాయి తయారీ కేంద్రంపై దాడి నిర్వహించారు. వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వారిని చింతలపూడి ఎస్ఇబి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలోని పురపాలక, నగరపాలక సంస్థలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి, పిహెచ్ వర్కర్స్‌కు ఇస్తున్న హెల్త్ అలవెన్సులు వెంటనే ఇవ్వాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా శనివారం ఏలూరులోని ఆర్ఆర్ పేట ఎస్ఆర్‌టు వద్ద ఎఐటియుసి ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగ సిబ్బంది నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న, పురపాలక, నగరపాలక సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన వేతనాల ఏరియర్స్‌ను చెల్లించాలని, కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు పంచాయతీల ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన ఒక నెల వేతనం చెల్లించాలని వారు కమిషనర్‌ను కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్.శ్రీనివాస్, బి.నారాయణరావు, డి.వెంకటేశ్వరరావు, నారా శ్రీను, కె.వెంకట్రామయ్య, ఎస్.సింహాచలం, డి.రవి, డి.అప్పారావు, సిహెచ్ అప్పారావు, జి.రవి పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు నూతన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇఇఎం సత్యనారాయణ తెలిపారు. ఉచిత విద్యుత్ కనెక్షన్‌కు ఇంటి పట్టా, ఆధార్ కార్డు, లబ్ధిదారుల రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యుత్ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తు పరిశీలించి నూతన ఉచిత విద్యుత్ కనెక్షన్ అందజేస్తామన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కేకవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.కృష్ణకిషోర్ తెలిపారు. శనివారం ప్రగడవరం వైఎస్ఆర్ క్లినిక్‌లో ఆయుష్మాన్ భవ కార్యక్రమం కింద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరునికి ఉచిత వైద్య సేవలు, వైద్య పరీక్షలు, టెలీ మెడిసిన్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి అబ్‌రార్ హుస్సేన్‌తో పాటు భరత్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాటియాకులగూడెంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెంలో ఇటీవల జ్వరాల కేసులు పెరుగుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి విష జ్వరాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరుగుతూ వారి ఆరోగ్య వివరాలు సేకరించారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రజారోగ్య దృష్ట్యా గ్రామంలో పలువురికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించి, దోమల నివారణకు మలాథీయన్ మందు పిచికారి, ఫాగింగ్ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు చరణ్, కార్యదర్శి వీరలక్ష్మీ, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

26న ఏలూరులో మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 26న ఏలూరులో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయము, ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్, ఎపిఎస్ఎస్‌డిసి ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో సెట్‌వెల్ కార్యాలయం, కలక్టరేట్ కాంపౌండ్, ఏలూరులో జాబ్ మేళా నిర్వహించబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8886882032ను సంప్రదించాల్సిందిగా తెలిపారు.

ముగిసిన 3వ జాతీయ ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ వైద్య కళాశాల, జిజిహెచ్, సర్ సిఆర్ రెడ్డి ఫార్మాసుటికల్ సైన్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం 3వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.కెవివి విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ వారోత్సవాల సందర్భంగా మందుల వాడకంతో వచ్చే ప్రతికూల ప్రభావాలను ఎలా అర్థం చేసుకోవాలో వివరించి ప్రజల్లో విశ్వాసం కల్పించామన్నారు. ఈ వారోత్సవాల్లో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డా.కె.భాస్కర్, డా.పి.సత్యనారాయణ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.శశిధర్, సిఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ ఎ.నరేంద్రబాబు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీలో విద్యుత్ ఘాతానికి గురై మరణించిన ట్యాంకర్ డ్రైవర్‌కు నష్టపరిహారం చెల్లించాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వై.గోపి, మండల అధ్యక్షుడు యన్.వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కన్వీనర్ రామిసెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మండలంలోని గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీలో ఫ్యాక్టరీ పనుల నిమిత్తం వచ్చిన లారీ డ్రైవర్ పవన్ కుమార్(43) విద్యుత్ ఘాతానికి గురై మరణించడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్ డ్యూటీలో విద్యుత్ ఘాతానికి గురై చనిపోవడం అతని కుటుంబానికి తీరని లోటన్నారు. ఫ్యాక్టరీ అంబులెన్స్ సకాలంలో స్పందించి ఉంటే ప్రాణాలు దక్కేవని, కనీసం రోజుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మంది పనిచేసే ఈ ఫ్యాక్టరీలో ఫస్ట్ ఎయిడ్ క్లీనిక్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఫ్యాక్టరీ పనులపై వచ్చే వాహనాలు, వాహనాలలో పనిచేసే సిబ్బందికి భద్రత చేకూర్చే బాధ్యత ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉందన్నారు. తక్షణమే ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం విద్యుత్ ఘాతానికి గురైన డ్రైవర్ కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించి పవన్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆ ప్రకటనలో ప్రభుత్వానికి, గోద్రేజ్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వారు విజ్ఞప్తి చేశారు.

'రీ సర్వే' చేయండి

1450 మంది పిల్లల వివరాలు తప్పుగా నమోదు

భీమడోలు: బడి బయట గల బడి ఈడు పిల్లల నమోదు కార్యక్రమం మండలంలో సక్రమంగా జరగనట్లు జిల్లా అధికారులు గుర్తించారు. మిషన్ జిఇఆర్-100 పేర మరొకమారు రీ సర్వేకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్పందించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ పద్మావతి దేవి, మండల విద్యాధికారి నెంబర్-1 ఇ.శ్రీనివాసరావు స్థానిక మండల వనరుల కేంద్రంలో శనివారం గతంలో నిర్వహించిన సర్వేలో పాల్గొన్న గ్రామ సచివాలయ సిబ్బంది, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ తాజాగా చేపట్టనున్న రీ సర్వే కార్యక్రమం పారదర్శకంగా, వివాద రహితంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల విద్యాధికారి నెంబర్-1 మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం మండలంలో గతంలో నిర్వహించిన సర్వే సందర్భంగా 1,450 మంది పిల్లల వివరాలు వయసు, విద్యార్హతలపరంగా తప్పుగా నమోదైనట్లు గుర్తించారన్నారు. దీనిలో భాగంగా 14 సంవత్సరాల లోపు ఉన్నవారు సైతం ఇంటర్‌పాస్ అయినట్లు నమోదు చేశారన్నారు. వీటన్నింటినీ నిర్ణీత గడువులోగా రీ సర్వే చేసి, తప్పులు సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. నాడు-నేడు పనులు ప్రగతి విషయం గురించి మాట్లాడుతూ మండలంలో 21 పాఠశాల భవనాల మరమత్తులు, పునర్నిర్మాణాలకు రూ.25.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయని, ఈ మేరకు ఇంతవరకు రూ.22.40 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. మరొక రూ.32.93 లక్షలు నిల్వ ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. మండలానికి మంజూరైన ఇరవై ఒక్క భవనాల్లో కేవలం ఒక భవనం మాత్రమే నిర్మాణం పూర్తయ్యే దశకు దగ్గరగా ఉందన్నారు. కొన్ని భవనాలకు మంజూరైన నిధులు చాలని నేపథ్యంలో వాటికి రీ ఎస్టిమేషన్ వేసేందుకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. భవన నిర్మాణాలు పూర్తి కాగానే తొలి దశలో మంజూరైన రూ.3.30 కోట్లు విడుదలవుతాయని ఆయన హామీ ఇచ్చారు.

పథకాలపై పూర్తిస్థాయి అవగాహనుండాలి

భీమడోలు: జిల్లాస్థాయిలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్వమిత్వ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న గ్రామపంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయి అవగాహన కల్పించుకోవాలని స్వమిత్వ జిల్లా శిక్షణా కేంద్రం సమన్వయకర్త నిఖిల్ కోరారు. జిల్లాస్థాయి శిక్షణా తరగతుల్లో పాల్గొన్న నాలుగవ బ్యాచ్‌కి చెందిన 70 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు స్వమిత్వ కార్యక్రమంపై క్షేత్రస్థాయి సందర్శన, అవగాహన కోసం జిల్లా స్థాయిలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన కోడూరుపాడును సందర్శించారు. వారికి స్వమిత్వ సర్వేపై గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా భీమడోలు మండల సర్వేయర్ ధర్మారావు, దుద్దేపూడి గ్రామ సచివాలయ డిజిటల్ సహాయకులు వెజ్జు ధర్మ వారికి అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు లేవనెత్తిన యాజమాన్య ధ్రువీకరణ, ఆక్రమణల క్రమబద్ధీకరణ, ఆస్తుల రిజిస్ట్రేషన్, ఇతర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దుద్దేపూడి, కోడూరుపాడు గ్రామపంచాయతీల సర్పంచులు ఎన్.శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావుతో పాటు గ్రామపంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి పాల్గొన్నారు.

మంచి యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రైతులు మంచి యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలు సాగుచేయాలని పెదవేగి మండల వ్యవసాయాధికారి ఎం.ప్రియాంక తెలిపారు. అమ్మపాలెంలో శనివారం జిల్లా ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమార్, టి.సుజాత, విఎఏలు, విహెచ్ఎలతో కలిసి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు రైతులతో కలిసి పొలంబడి క్షేత్రాన్ని సందర్శించారు.

గోపురం నిర్మాణానికి మార్కింగ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

రెండో పూరీగా ప్రసిద్ధి గాంచిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథ స్వామివారి దేవస్థానంలో నూతనంగా నిర్మించనున్న ఏడంతస్తుల మహారాజు గోపురం నిర్మాణానికి అధికారులు శనివారం మార్కింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు, దేవస్థానం ఛైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మీ పాల్గొన్నారు.

ఆటలపోటీల్లో కేతవరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న పెదవేగిలో నిర్వహించిన బేస్‌బాల్ అండర్-14 విభాగంలో కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెలగ రవీంద్ర ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయులు బి.కృష్ణ శనివారం తెలిపారు.

పోలవరం నియోజకవర్గం స్థాయిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో బర్రింకలపాడులో ఈనెల 20, 22 తేదీలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన బేతి హర్ష, మేకా మోషిత, ట్రిపుల్ జంప్ టెన్నీ కాయిట్‌లో కొమ్మంటి ప్రభాకర్, బాడ్మింటన్‌లో కొండపల్లి శ్రీను, యోగాలో మేకా నాగ చైతన్య, కాసగాని మౌనిక, కొలుకులూరి హేమశ్రీలు ఉత్తమ ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ప్రతిభా పురస్కార ప్రధానోత్సవానికి ఏర్పాట్లు

కెవి.సత్యనారాయణ పురస్కారం అందుకోనున్న డాక్టర్ వనజా ఉదయ్

ఏలూరు అర్బన్: ఈనెల 26వ తేదీ ఏలూరులోని వైఎంహెచ్ఎ హాలులో కెవి.సత్యనారాయణ ప్రతిభా పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వైఎంహెచ్ఎ, కెవిఎస్ ట్రస్ట్ ప్రతినిధులు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబధించిన ఆహ్వాన పత్రాన్ని కార్యవర్గ సభ్యులు శనివారం విడుదల చేశారు. హిందూ యువజన సంఘం(వైఎంహెచ్ఎ), కెవిఎస్ ట్రస్టు ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో "కళారత్న" కెవి.సత్యనారాయణ జన్మదినోత్సవము సందర్భంగా నిర్వహిస్తున్నామన్నారు. 2023 సంవత్సరానికి గాను కెవి.సత్యనారాయణ ప్రతిభా పురస్కారాన్ని నాట్యరంగంలో విశిష్ట ప్రతిభ కలిగిన నాట్య గురువు శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ కూచిపూడి నాట్య విభాగాధిపతి 'కళారత్న' డాక్టర్ వనజా ఉదయ్‌కు అందజేయనున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు వివిధ నృత్య సంస్థల చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉన్నాయన్నారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సభా కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఎ ఉప సభాపతి, మండలి బుద్ధ ప్రసాద్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎవి.శేషసాయి, అమెరికాలోని వివిధ తెలుగు సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న డాక్టర్ తోటకూర ప్రసాద్, ధూళిపాళ్ల భానుప్రకాష్, గుత్తికొండ శ్రీనివాస్, కోసరాజు ప్రసాద్ తదితరులు విచ్చేస్తారని సంస్థ మేనేజ్‌మెంట్ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు తెలిపారు. కావున ప్రజలు, కళాభిమానులు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యురేకా ఫోర్బ్స్ లిమిటెడ్‌కు ఉత్తర్వులు

వినియోగదారుడికి రూ.25వేల పరిహారం, రూ.5వేలు ఖర్చులు చెల్లించాలని తీర్పు

ఏలూరు టౌన్: నిరోధిత, ఆంక్షల వాణిజ్య సరళి, అసౌకర్యం, మానసిక ఆందోళనలకు గురి చేసిన నేపథ్యంలో వినియోగదారుడికి రూ.25 వేలు పరిహారం, మరో రూ.5 వేలు ఖర్చులు చెల్లించాలని ముంబైలోని 'యురేకా ఫోర్బ్స్' లిమిటెడ్‌కు జిల్లా వినియోగదారుల కమీషన్ ఉత్తర్వులు జారీ చేసింది. కేసు పూర్వాపరాలు విచారించిన కమీషన్ అధ్యక్షుడు డి.కోదండ రామమూర్తి, సభ్యులు ఎస్.సురేష్ కుమార్, కెఎస్ఎన్ లక్ష్మి ఈమేరకు తీర్పు వెల్లడించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2019లో అశోక్‌నగర్ సోనోవిజన్‌లో ఏలూరుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ బికెఎస్ అయ్యంగార్ రూ.19,500 చెల్లించి యురేకా ఫోర్బ్స్ ఆక్వాగార్డ్ జీనియస్ వాటర్ ప్యూరిఫైయర్ కొనుగోలు చేశారు. వారంటీ, తదుపరి రెండు సంవత్సరాల కాలంలో పలుమార్లు వాటర్ ప్యూరీఫైర్‌కు మరమ్మతులు రావటం, కంపెనీ వారు వచ్చి బాగు చేయటం జరిగింది. అలాగే లోపల అమర్చిన ఒక ప్రత్యేకమైన చిప్‌ను కూడా మార్చారు. ఆ రెండు సంవత్సరాలు మెయింట్ నెన్స్‌కు గాను ఏడాదికి రూ.5,900 వినియోగదారుడు చెల్లించారు. 2022లో మెయింట్ నెన్స్ రెండేళ్లకు ఒక్కసారే రూ.12 వేలు చెల్లించాలని కంపెనీ చెప్పడంతో వినియోగదారుడు ఏడాది కాలానికే గతంలో చెల్లించిన విధంగానే చెల్లిస్తామన్నారు. సదరు కంపెనీ వారు సమ్మతించలేదు. దీంతో చేసేది లేక వినియోగదారుడు బయట వేరే సంబంధిత నిపుణులను సంప్రదించగా వారు తాము చేయలేమని, ఆ ఎక్యూప్‌మెంట్‌లో చిప్ అమర్చడం వల్ల తాము మరమ్మత్తులు చేయలేమని స్పష్టం చేశారు. ఇలా చిప్ అమర్చడం అన్ ఫెయిర్ ట్రేడ్ ప్రాక్టీస్ అవుతుందని, సదరు సంస్థపై చర్యలు తీసుకుని, తమకు పరిహారం ఇప్పించాలని అయ్యంగారు 2022 మే 12వ తేదీన తమ పిటీషన్‌లో కమీషన్‌కు విజ్ఞప్తి చేశారు. తమ వాటర్ ప్యూరిఫైయర్ చిప్ కేవలం తమ ఆరోగ్య పరిరక్షణ కోసమని ఆ సంస్థ నిపుణులు వాదించారు. తమ ఎక్యూప్‌మెంట్ హెపటైటిస్-సిని కూడా రాకుండా నిరోధిస్తుందని చెప్పటంతో కమిషన్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. హెపటైటిస్-సిని నీటి ద్వారా రాదని, ఇంజక్టబుల్స్, రక్త మార్పిడి వల్ల వచ్చే అవకాశం ఉంటుందనే విషయం ఆ సంస్థకు బోధపడకపోవటం విశేషం. కేసు విచారించిన కమీషన్ పై మేరకు ఆదేశాలు ఇచ్చింది. అంతేకాకుండా ఇలా 'చిప్' ఏర్పాటు చేయటం (రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీస్) అవుతుందని కమీషన్ పేర్కొంది. సెంట్రల్ కన్యూమర్స్ ప్రొటక్షన్ అథారిటీ కూడా ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారునికి కమీషన్ అనుమతినిచ్చింది.

జాబ్‌మేళా నిర్వహణ ఆనందదాయకం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ముసునూరు

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందకు మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించడం ఆనందదాయకమని ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో 16 గ్రామాల నిరుద్యోగ యువకులకు భారత ప్రభుత్వ సంస్థ సిఐపిఇటి వారి సౌజన్యంతో మిషన్ ఆప్‌రేటర్, ప్లాస్టిక్ ప్రోసెసింగ్‌లనే టెక్నికల్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు, ఆయా రంగాలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఉన్నత చదువులు కలిగిన వ్యక్తులకు హైదరాబాద్, బెంగుళూరు, చైన్నై, అనంతపురం ఇలా పలు ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించునున్నట్లు తెలపారు. వయస్సు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు వ్యక్తులు 25 మంది హాజరుకాగా, వారిలో ఎస్‌సి రిజర్వేషన్-10, ఒబిసి రిజర్వేషన్-5 ఎంపికైనట్లు సూపర్‌వైజరు సాకిరి రామకృష్ణ తెలిపారు.

నేడు అఖిలపక్ష సమావేశం

ఆగిరిపల్లి: వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆదివారం ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో నిర్వహించే అఖిలపక్ష సమావేశంలో ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయకార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు కోరారు.

పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు

ముదినేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ముదినేపల్లి, గురజ, పెనుమల్లి, సంకర్షణపురం, వడాలి, సింగరాయపాలెం, తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనలు ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ట్రాక్టర్లపై ఊరేగింపు నిర్వహించారు. యువతులు కేరింతలతో నృత్యం చేసుకుంటూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటకుమార్ పర్యవేక్షించారు. అదేవిధంగా ఉత్సవాలు ముగింపు సందర్భంగా పలు గ్రామాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు.

ముసునూరు: గ్రామాల్లో గణపతి పూజలు నిర్వహించుకోవడం వల్ల భక్తిభావంతో పాటు అందరిలో ఐక్యతభావం పెరుగుతుందని గుడిపాడు రైతు సంఘం నాయకులు రాయ్యంకుల లక్ష్మణరావు తెలిపారు. శనివారం లడ్డు వేలం పాట నిర్వహించారు.

చిన్న వెంకన్న సన్నిధిలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ద్వారకాతిరుమల: చిన్న వెంకన్నను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా శనివారం ఉదయం దర్శించుకున్నారు. మొదట ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి వేండ్ర త్రినాథరావు స్పీకర్‌ను శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భీమడోలు: వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు విజృంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి కోరారు. పొలసానిపల్లి గ్రామంలో డెంగ్యూ కేసు నమోదైన నేపథ్యంలో జోనల్ మలేరియా అధికారి తన బృందంతో కలిసి పొలసానిపల్లిలో శనివారం సాయంత్రం పర్యటించి డెంగ్యూ బాధితున్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం మండలం, మత్స్యపురి గ్రామం, పెదపేట డోర్ నెం. 1-16 కాపురస్తులు దిడ్ల వెంకటలక్ష్మి, W/o. దిడ్ల శ్రీను అను నేను ది. 21-09-2023వ తేదీన విదేశములకు జీవనోపాధి నిమిత్తం వెళ్లి తిరిగి ఇండియాలో గల నా స్వగ్రామమునకు వచ్చుచుండగా హైదరాబాద్ నుండి భీమవరం కొత్త బస్టాండ్‌లో దిగి నా స్వగ్రామం అయిన మత్స్యపురి గ్రామానికి ఆటోలో వెళ్లుచుండగా మార్గం మధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు వున్న బ్యాగ్ పడిపోయినది. నెం. **M5707923** గల నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. కావున దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

దిడ్ల వెంకటలక్ష్మి, W/o. దిడ్ల శ్రీను
మత్స్యపురి, వీరవాసరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9000373825

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 48/2012

వాద్లు: వీరవల్లి నరశింహులు (died) and 4 Others

ప్రతివాద్లు: వీరవల్లి జానకి రామారావు and Others

6వ ప్రతివాది: వీరవల్లి నాగేశ్వరరావు, S/o. late విశ్వనాథం, వయస్సు 30 సం॥లు, పెద్దింట్లమ్మ గుడి దగ్గర, డోర్ నెం. 13-65, బంటుమిల్లి, పాలకోడేరు మండలం, ప॥గో॥జిల్లా, BJCJC.

7వ ప్రతివాది: వీరవల్లి దుర్గారావు, S/o. late విశ్వనాథం, వయస్సు 28 సం॥లు, పెద్దింట్లమ్మ గుడి దగ్గర, డోర్ నెం. 13-65, బంటుమిల్లి, పాలకోడేరు మండలం, ప॥గో॥జిల్లా, BJCJC.

పై నెంబరు దావాలో 6, 7 ప్రతివాదులకు శ్రీ కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినప్పటికిన్ని సదరు 6, 7 ప్రతివాదులు ఉద్దేశ్యపూర్వకంగా Avoid చేయుచున్నారు. కావున సదరు 6, 7 ప్రతివాదులు హాజరు నిమిత్తము **ది. 06-10-2023 సం॥రం తేదీకి వాయిదా అయివున్నది.** సదరు తేదీన సదరు 6, 7 ప్రతివాదులు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేనియెడల సదరు 6, 7 ప్రతివాదులు పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడును.

K.SOMA SEKHARA PRASAD
భీమవరం Advocate, Bhimavaram
ది. 19-9-2023 Cell: 9848777584